# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 11-10-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ యురేషియా, పశ్చిమాసియా ప్రాంతాలలో శాంతి, సుస్థిరతలు నెలకోనాలని యావత్ ప్రపంచం కోరుకుంటోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఉద్ఘాటించారు.
- ❖ లెబనాన్ లో నెలకొన్న పరిస్థితుల పట్ల భారత విదేశాంగ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది.
- ❖ దేశ వ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో దుర్గాపూజా ఉత్సవాలు అత్యంత ఉత్సాహంగా జరుగుతున్నాయి.
- ❖ అణు బాంబులు లేని ప్రపంచం ఆవిష్కరణ కోసం చేసిన కృషికి గుర్తింపుగా జపాన్ సంస్థకు నోబెల్ శాంతి బహుమతి లభించింది.
- ❖ రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ సిక్కిం రాజధాని గ్యాంగ్ టక్ లో పర్యటిస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

దక్షిణ చైనా సముద్ర ప్రాంతంలో శాంతి, భద్రత, సుస్థిరత మొత్తం ఇండో - ఫసిఫిక్ ప్రాంత ప్రయోజనాల కోసమేనని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉద్ఘాటించారు. లావోస్‌లోని వియంటి యాన్ లో ఈ రోజు జరిగిన 19వ తూర్పు ఆసియా సదస్సులో ప్రధానమంత్రి మాట్లాడుతూ... ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో కొనసాగుతున్న సంఘర్షణల పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. అభివృద్ధి అన్న నినాదం విస్తరణ నినాదం కాదని స్పష్టం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో కొనసాగుతున్న విభేదాలు గ్లోబల్ సౌత్ దేశాలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని.. యురేషియా, పశ్చిమాసియా ప్రాంతాలలో శాంతి సుస్థిరతలు నెలకొనాలని అందరూ కోరుకుంటున్నారని అన్నారు. ఇది యుద్ధ యుగం కాదని, సమస్యలకు యుద్ధ రంగం నుండి పరిష్కారం లభించదని నరేంద్ర మోడీ పేర్కొంటూ...

(వాయిస్ 36 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

లెబనాన్ లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితి పట్ల భారతదేశం ఆందోళన వ్యక్తం చేసింది. లెబనాన్ లో పరిస్థితిని భారత ప్రభుత్వం నిశితంగా గమనిస్తోందని, బ్లూ లైన్ వెంబడి క్షీణిస్తున్న భద్రతా పరిస్థితిపై ఆందోళన చెందుతోందని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఐక్య రాజ్య సమితి నియమనిబంధనలను అందరూ తప్పనిసరిగా గౌర వించాలని ఆ ప్రకటనలో విదేశాంగ శాఖ పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో దుర్గా పూజ ఉత్సవాలు అత్యంత ఉత్సాహంతో జరుగుతున్నాయి. శరన్నవరాత్రి ఉత్సవాలలో ఈ రోజు ముఖ్యమైన రోజు దుర్గాష్టమి కావడంతో అన్ని ప్రాంతాలలోని ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పాట్నా, ముజఫర్ పూర్, గయా, భాగల్ పూర్, పూర్నియా తదితర ప్రాంతాల్లో దుర్గామాత దర్శనం కోసం భక్తులు భారీ సంఖ్యలో ఆలయాలకు తరలివస్తున్నారు. కర్నాటక రాష్ట్రంలో మైసూర్ నగరంలో దసరా పండుగ సంబరాలు అట్టహాసంగా జరుగుతున్నాయి. ఒక్క మైసూర్ నగరంలోనే కాకుండా రాష్ట్ర మంతటా అన్ని నగరాలు ఈ ఉత్సవ శోభతో ఉట్టి పడుతున్నాయి. మైసూర్ భవంతిని దసరా పండుగ కోసం సర్వాంగ సుందరంగా అలంకరించారు. రేపు విజయదశమి ముగింపు ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ శాంతి బహుమతి 2024 సంవత్సరానికి జపాన్ కు చెందిన నిహాన్ హిడాంక్యో అనే సంస్థను వరించింది. ప్రపంచానికి అణుబాంబుల వల్ల ఎంతో ముప్పు ఉందని, వీటిని విడనాడాలని ఈ సంస్థ ప్రచారం చేస్తోంది. అణుబాంబులు లేని ప్రపంచాన్ని ఆవిష్కరించడం కోసం నిహాన్ హిడాంక్యో సంస్థ చేస్తున్న కృషికి గుర్తింపుగా నోబెల్ కమిటీ ఈ శాంతి పురస్కారాన్ని ప్రకటించింది. జపాన్‌పై రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో అణుబాంబుల దాడి జరిగింది. ఈ బాంబుల బారిన పడిన ప్రజలు ఇప్పటికీ ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారు. అటువంటి బాధితులకు ఈ సంస్థ బహుముఖంగా సేవలు అందిస్తోంది. నాగసాకి, హిరోషిమాలపై జరిగిన బాంబు దాడుల్లో ఇప్పటికీ అనేకమైన శారీక సమస్యలు ప్రజలు ఎదుర్కొంటున్నారు. ఈ విధంగా గాయపడిన వారికి తాము సానుభూతి ప్రకటిస్తునట్లు కూడా నోబెల్ సంస్థ పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సిక్కిం రాష్ట్ర రాజధాని గ్యాంగ్‌టక్‌లో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ఆర్మీ కమాండర్ల సమావేశంలో పాల్గొంటారు. కీలకమైన వ్యూహాత్మక అంశాలను పరిష్కరించడం, రక్షణ సంసిద్ధత గురించి చర్చించడం, వేగంగా అభివృద్ధి చెందుతున్న భద్రతా వాతారణంలో కార్యాచరణ సంసిద్ధతను రూపొందించడం ఈ సమావేశం ముఖ్య ఉద్దేశం.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

నావికాదళానికి సంబంధించిన నవకల్పన, స్వదేశీకరణ 3వ ఎడిషన్‌లో భాగంగా "స్వావలంబన్ - 2024" సదస్సు ఈనెల 28, 29వ తేదీలలో ఢిల్లీలోని భారత మండపంలో జరగనుంది. ఇప్పటి వరకూ నిర్వహించిన స్వావలంబన్ రెండు ఎడిషన్లలో భారత పారిశ్రామిక రంగం నుండి భారతీయ నౌకాదళానికి 2 వేలకు పైగా ప్రతిపాదనలు అందాయి. తొలి నమూనాలను అభివృద్ధి చేయడానికి వీలుగా వీటిని 155కు కుదించారు. ఇప్పటి వరకూ నిర్వహించిన సదస్సులలో పొందిన అనుభవం "స్వావలంబన్ – 2024" సదస్సుకు దోహదపడుతుందని ఆశిస్తున్నారు. నవకల్పన, స్వదేశీకరణల దిశలో సరికొత్త ఉత్తేజం కూడా లభిస్తుందని భావిస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈరోజు లోక్ నాయక్ జయప్రకాశ్ నారాయణ్, భారతరత్న నానాజీ దేశ్ముఖ్ ల జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ వారికి నివాళులు అర్పించారు. దేశానికి, సమాజానికి జయప్రకాశ్ నారాయణ్ ఘనమైన సేవలు అందించారని ఒక సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. జయప్రకాశ్ నారాయణ్ వ్యక్తిత్వం, ఆదర్శాలు ప్రతీతరానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని అన్నారు. భారతరత్న నానాజీ దేశ్ముఖ్ దేశంలోని గ్రామీణ ప్రజల సాధికారత కోసం అంకిత భావంతో సేవ చేశారని కూడా నరేంద్రమోదీ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

లావో పీడీఆర్ ప్రధాని సోనెక్సే సిపాండన్ తో ప్రధానమంత్ర నరేంద్రమోదీ ఈరోజు వియాంటీయాన్‌లో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. 21వ ఆసియాన్ - ఇండియా, 19వ తూర్పు ఆసియా సదస్సులను విజయవంతంగా నిర్వహించినందుకు లావోస్ ప్రధానిని ఆయన అభినంధించారు. భారత్ - లావోస్ దేశాల మధ్య చారిత్రక, సమకాలిన ఒప్పందాలను మరింత బలోపేతం చేసే అంశంపై ఇరుదేశాల ప్రధానులు జరిపిన చర్చలు ఫలప్రదం అయ్యాయి. అభివృద్ధి భాగస్వామ్యం, సామర్థ్యాలను పెంపొందించడం, విపత్తు నిర్వహణ, పునరుత్పాదక ఇంధనం, వారసత్వ పునరుద్ధరణ వంటి రంగాలలో ద్వైపాక్షి సహకారం గురించి ఇరు దేశాల నేతలు చర్చించారు. కాగా లవోస్ కు వరద సహాయం అందించినందుకు భారత ప్రధానికి లావోస్ ప్రధాని ధన్యవాదాలు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

జమ్మూ కాశ్మీర్ శాసనసభ ఎన్నికల్లో మొత్తం 90 స్థానాలకు గాను 42 స్థానాల్లో విజయం సాధించి ఏకైక అతిపెద్ద పార్టీగా నిలిచిన నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీకి కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది. జమ్మూ కాశ్మీర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తారిఖ్ హమీద్ కర్రా.. నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ నాయకులు ఓమర్ అబ్దుల్లాకు ఈ మేరకు లేఖ రాశారు. అంతకుముందు కాంగ్రెస్ పార్టీ శాసనసభా పక్షం సమావేశమై నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీకి మద్దతుతెలిపి ప్రభుత్వం ఏర్పాటుకు సహకరించాలని తీర్మానించింది. అనంతరం తీర్మానం కాపీని ఆ పార్టీ అధ్యక్షులు తారిఖ్ హామీద్ కు అందజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

తూర్పు ఆసియా శిఖరాగ్ర సదస్సు సందర్భంగా లావోస్‌లోని వియాంటియాన్ లో థాయిలాండ్ ప్రధాని పేటోంగ్ టర్న్ షినవత్రాతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు సమావేశమయ్యారు. ఇరువురు ప్రధానమంత్రులు సమావేశం కావడం ఇదే మొదటి సారి. థాయిలాండ్ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నరేంద్రమోదీ ఆమెకు అభినందనలు తెలిపారు. ఇరు దేశాల నేతలు పలు రంగాల్లో ద్వైపాక్షిక సహకారంపై చర్చించారు. ఉప- ప్రాంతీయ, ప్రాంతీయ, బహుపాక్షిక వేదికలలో సన్నిహిత సహకారాన్ని పెంపొందించే మార్గాలపై ఇరుదేశాల నేతలు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రాంతీయ సహకారాన్ని బలోపేతం చేయడం గురించి కూడా చర్చించారు. ఈ సంవత్సరం దశాబ్ధి వేడుకలు జరుపుకుంటున్న భారతదేశ “యాక్ట్ ఈస్ట్ విధానం” కోసం ఇండో పసిపిక్ విషయంలో భారత దార్శనికత కోసం థాయిలాండ్‌తో భారత్ చేసుకునే ఒప్పందాలు అత్యంత కీలమైనవిగా ఉంటాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = =